సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వాహనాల రికార్డుల తనిఖీ



మద్దిలపాలెంలో వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న రవాణా శాఖాధికారులు

మద్దిలపాలెం : వాహనాల రికార్డులను రవాణా శాఖాధికారులు బుధవారం తనిఖీలు చేశారు. మద్దిలపాలెంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి, తదితరులు వాహనచోదకులను ఆపి ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు ఉన్నాయా? లేవా? అని క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత పత్రాలు లేని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాహన చోదకుల వద్ద లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

చర్మ సంరక్షణకు పౌష్టికాహారం అవసరం

బీచ్ రోడ్డు: చర్మ సంరక్షణకు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి తెలిపారు. బుధవారం చర్మ సంరక్షణ-తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. అల్ట్రాప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, చక్కెర అధిక వినియోగం చర్మ సమస్యలకు కారణమన్నారు. విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలతో కూడిన ఆహారం చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. తగినంత విశ్రాంతి ఉండేలా చూసుకోవాలన్నా. ఈ చిట్కాలు చర్మాన్ని సంరక్షించడంలో సహాయ పడతాయని చెప్పారు.


పోలీసుల అదుపులో బైక్ దొంగ

అల్లిపురం: తాకట్టు పెట్టిన బైక్‌ను దొంగతనంగా తీసుకొచ్చి విక్రయిస్తున్న యువకుడిని టూటౌన్ పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లికి చెందిన షేక్ మీరా చింతపల్లి నుంచి హెచ్‌ఎఫ్ డీలక్స్ బండిపై నగరానికి చేరుకున్నాడు. తన వెంట తీసుకొచ్చిన బండిని పూర్ణామార్కెట్ దరి కల్లుపాకల వద్ద గల పాత టూవీలర్ స్క్రాప్ దుకాణంలో అమ్ముతుండగా సమాచారం మేరకు టూటౌన్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన

కంచరపాలెం: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం కంచరపాలెం రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, పందిరి కూరగాయల సాగు, మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి జి.సోని, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం



సింధియా: డాల్ఫిన్‌నోస్ నేవల్ ఏరియాలోని నేవీ సిబ్బంది గృహ సముదాయాల వద్ద 9 అడుగుల నాగుపాము సంచారం కలకలం సృష్టించింది. ఆ ప్రాంతంలోని రోడ్డుపై తిరుగుతూ గోడ రంధ్రంలో దూరడంతో అక్కడి సిబ్బంది చూసి పాములు పట్టే నేర్పరి నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే నాగరాజు అక్కడికి చేరుకుని నాగుపామును పట్టుకుని నిర్మానుష్యమైన ప్రదేశంలో విడిచిపెట్టాడు. విషసర్పం కావడంతో ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడం అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో తరచూ పాముల సంచారం కనిపిస్తోందని, వర్షా కాలంలో మరింత అధికంగా ఉంటుందని, తగు నియంత్రణ చర్యలు చేపడతామని నేవీ అధికారులు తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606



జైపాతాళ భైరవి నాటకంలో పలు సన్నివేశాలు





అబ్బురం.. జైపాతాళ భైరవి

మద్దిలపాలెం : సురభి నాటకోత్సవాలలో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఐదో రోజు జైపాతాళ భైరవి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం ఆద్యంతం ప్రేక్షకులను మైమరిపించింది. రెప్పపాటులో మారుతున్న సెట్టింగ్‌లతో వెండి తెరను మరిపించేలా కళాకారులు తమ ప్రతిభతో ప్రదర్శించి ప్రేక్షకులు హృదయాలను దోచుకున్నారు. రంగసాయి నటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి నేతృత్వంలో ప్రదర్శించిన ఈ నాటకాన్ని రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, మళ్లేల రాజేంద్రప్రసాద్, మరపట్ల భాస్కరరావు తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతగా ఎస్ఎస్ఆర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా బాదంగీర్ సాయి మాట్లాడుతూ పౌరాణిక పద్య నాటకానికి మహానగర కళాభిమానులు బ్రహ్మరథం పట్టారన్నారు.

ఓపెన్ బార్లు C/o ముడసర్లోవ రోడ్లు



ముడసర్లోవ వద్ద బీఆర్‌టీఎస్ ఫుట్‌పాత్‌పై తాగి పడేసిన ఖాళీ బీరు సీసాలు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో రోడ్లు ఓపెన్ బార్లుగా మారాయి. విశాలమైన బీఆర్‌టీఎస్ కారిడార్ పక్కన ఫుట్‌పాత్‌లపైనే మందుబాబులు దర్జాగా మందు పార్టీలు చేసుకుంటున్నారు. తాగిన అనంతరం మద్యం బాటిళ్లను రహదార్లపైనే పగలుగొట్టి పడేసి వెళ్లిపోతున్నారు. దీన్‌దయాల్‌పురం కూడలి నుంచి రామకృష్ణాపురం కూడలి వరకు, శ్రీకృష్ణాపురం కూడలి నుంచి పైనాపిల్ కాలనీ కూడలి వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇరువైపులా ఫుట్‌పాత్‌లను సాయంత్రం సమయంలో మందుబాబులు ఓపెన్ బార్లుగా ఉపయోగించుకుంటున్నారు. సాయంత్రం సమయంలో మందుబాబులు ఫుట్‌పాత్‌లపై దర్జాగా కూర్చొని మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో కొందరు ఆ బాటిళ్లను పగులుగొడుతుండగా మరికొందరు ఫుట్‌పాత్‌లపై పడేస్తున్నారు. తెల్లవారేసరికి జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు వాటిని సేకరించి బయటకు తరలిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు సేకరించిన ఆ బాటిళ్లు రోజూ ఉదయం నడక కోసం వెళ్తున్న వారికి కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

◆ ముడసర్లోవ రిజర్వాయరు వెనక ప్రాంతంలోని రోడ్లు నిత్యం మందుబాబులతో రద్దీగా ఉంటుంది. వారి ఆగడాలకు ఆ రోడ్లపై ప్రయాణించడానికి వాహనచోదకులు భయపడిపోతున్నారు. రోడ్లపై మద్యం సేవించి ఖాళీ బాటిళ్లు పగలుగొడుతున్నారు. దీంతో రోడ్లన్నీ గాజు పెంకులతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అటువైపుగా వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాల టైర్లు పంక్చర్ అవుతున్నాయి. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని చెక్ చేస్తున్న పోలీసులు.. ఈ మార్గంలో మద్యం సేవించే వారిపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

సమత కళాశాలలో జాబ్‌మేళాకు స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న వరుణ్ మోటార్స్ హెచ్‌ఆర్ రోహిత్ విలయమ్స్

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-10లోని సమత కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య జి.శ్రీనివాసరావు, వరుణ్ మోటార్స్ హెచ్‌ఆర్ రోహిత్ విలియమ్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై వరుణ్ గ్రూప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల విద్యార్థులకు హెచ్‌ఆర్, ఫైనాన్స్ సెక్టార్లలో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకుంటున్నట్లు వెల్లడించారు. వరుణ్ మోటార్స్ హెచ్‌ఆర్ రోహిత్ విలియమ్స్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా ద్వారా ఎంతో మంది విద్యార్థులకు కళాశాల దశలోనే ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో టీమ్ ఎంపికల ప్రక్రియను నిర్వహించారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

సీతంపేట: డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ కాటు ద్వారా సంక్రమించే డెంగ్యూ జ్వరం నుంచి రక్షణ పొందాలని సూచించారు. వారం రోజులు దాటి నీటి నిల్వలుంటే దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారుతాయని, దోమల కట్టడికి ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దీనికి సంబంధించి పలు నినాదాలతో ర్యాలీ చేశారు. జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ ఎల్.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతోనే డెంగ్యూ నివారణ



జిల్లా అధికారులకు సూచనలు ఇస్తున్న స్టేట్ మలేరియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం

దాబాగార్డెన్స్: రానున్న వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్టేట్ మలేరియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం జిల్లా అధికారులను ఆదేశించారు. నగరంలో డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలైన జబ్బరితోట, రంగిరీజు వీధి ప్రాంతాల్లో బుధవారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. డెంగ్యూ జ్వర బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే ఈడిస్ దోమల నియంత్రణకు చేపడుతున్న యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్, స్ప్రేయింగ్, చికిత్స, అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల మలేరియా విభాగం అధికారులతో సమావేశమయ్యారు. డెంగ్యూ జ్వరాలను అదుపు చేయడానికి చేపట్టాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా మలేరియా విభాగం అధికారి తులసీరాజ్, జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్ఈవో శేషుబాబు, ఇతర మలేరియా విభాగం సిబ్బంది, జీవీఎంసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని వ్యక్తి ఆత్మహత్య

ఆరిలోవ: తన భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి ఎండాడ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రామాలయం వీధిలో ప్రగడ సతీష్(39), భార్య దేవి, ముగ్గురు పిల్లలతో నివాసముంటున్నారు. సతీష్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో దేవి అదే గ్రామంలో ఉన్న కన్నవారి ఇంటికి పిల్లల్ని తీసుకుని వెళ్లిపోయింది. సతీష్ తన భార్యకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం రాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు సున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగు పొరుగు వారు బుధవారం ఉదయం చూసి దేవికి సమాచారం అందించారు. ఆమె వచ్చిన అనంతరం స్థానికులు, బంధువులు కలసి ఇంటి తలుపులు తెరిచారు. అనంతరం ఆమె ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతులు

- పోరాట కమిటీ తీర్మానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు సెయిల్‌లో విలీనం, ముడి పదార్థాల లభ్యత తదితర అంశాలపై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రజాప్రతినిధులను కలవనున్నారు. అంబేడ్కర్ కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సాధ్యమైనంత త్వరలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో విశాఖ ఎంపీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌లను కలిసి సమస్యలను వివరించనున్నారు. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను మర్యాదపూర్వకంగా కలవాలని నిర్ణయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర ఉక్కు సహాయమంత్రి బి. శ్రీనివాసవర్మ, విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబులను కలవనున్నారు. ఈ సందర్భంగా హైకోర్టులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేసిన కేసు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు సీహెచ్. నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, వై.టి.దాస్, వై.మస్తానప్ప, బి.డేవిడ్, పరంధామయ్య పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్‌ను అభినందిస్తున్న ఏపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్

మహారాణిపేట: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.ఎన్. హరేంధ్రప్రసాద్‌ను సర్వేయర్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ జిల్లా అధ్యక్షుడు, భీమిలి ఆర్డీవో ఆఫీసు డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ పంపాన కనకబాబు ఆధ్వర్యంలో సర్వేయర్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల అభినందన..

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధ్రప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి అభినందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీఆర్ఎస్ రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ రాజేంద్రవర్మ, జిల్లా కోశాధికారి రాజేష్, సిటీ అధ్యక్షుడు యోగి, కార్యదర్శి రవిశంకర్, సుధీర్, సురేష్, కోటి, సిద్ధార్థ, త్రినాథ్, సుధాకర్, చంద్రశేఖర్, రాజు తదితరులు ఉన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధ్రప్రసాద్‌ను జిల్లా నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సహాధ్యక్షుడు ఎల్.కోటేశ్వరరావు, రెడ్డి వరలక్ష్మి, విద్యాధర్, రమేష్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

సుప్రసిద్ధ రచయిత బలివాడ



మాట్లాడుతున్న రచయిత కె.జి.వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనంలో వైవిధ్యభరితమైన కవితలు చదివి అందరినీ అలరించారు. రచయిత బలివాడ కాంతారావు జయంతి సందర్భంగా డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ తెలుగు నవల, కథా సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సృష్టించుకున్న సుప్రసిద్ధ రచయిత బలివాడ కాంతారావు అని పేర్కొన్నారు. బాల్యంలోనే స్కూల్ మ్యాగజైన్‌కు సంపాదకుడిగా పనిచేసిన ఘనత ఆయనదని తెలిపారు. బలివాడ 38 నవలలు, 400 వరకు కథలు, 5 నాటికలు, మరెన్నో రేడియో నాటికలు రాశారన్నారు. నిజాయితీ, నిక్కచ్చితనం, జాలి, దయ, కరుణ ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవని చెప్పారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు వారు గర్వించదగ్గ రచయిత బలివాడ కాంతారావు అని కొనియాడారు. రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.సిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, పి.వి.ఆర్.కుమార్, పరమేశ్వరరావు, బి.రాధారాణి, సురేష్ తదితరులు కవితలు చదివి వినిపించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి సీజ్



గంజాయి, నిందితులతో పోలీసులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వేపోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. రాజస్తాన్‌కు చెందిన పరమేశ్వర్‌జాట్, కమలేష్ వైష్ణవ్‌లను, వేరొక కేసులో ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన రామేశ్వర్‌నాయక్, ప్రతాప్‌నాయక్‌లను తనిఖీలు చేయగా వీరు చెన్నైకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.55 లక్షల విలువైన సుమారు 51 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మిక వైభవం



జగన్నాథ, సుభద్ర, బలభద్రస్వామి

జగన్నాథ స్వామి రథోత్సవాలు అంగరంగ వైభవంగా నేడు ప్రారంభం కానున్నాయి. టౌన్ కొత్త రోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి వారి రథయాత్రకు నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. స్వామి వారి రథోత్సవంలో భాగంగా రోజుకొక అవతారంలో స్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. ఆ రూపాలను వీక్షించి భక్తులు తరించిపోతారు.

- నేటి నుంచి జగన్నాథుని రథోత్సవాలు
- ప్రతిష్టా ప్రారంభ సంకల్పం నేడు
- 5వ తేదీ రాత్రి విశేష హోమాల నిర్వహణ
- 6న పూర్ణాహుతి, నేత్రోత్సవం, సుభద్రాదేవి శాంతి కల్యాణం
- 7న తొలి రథయాత్ర
- 8 నుంచి స్వామి దశావతారాలు
- 18న తిరుగు రథయాత్ర

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవం ఈ నెల 4 నుంచి 19 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 4 గురువారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి సాయంత్రం ప్రతిష్ఠాపన సంకల్పం, 5న అమావాస్య ఉదయం జలాధివాసం, క్షీరాధివాసం, రాత్రి విశేష హోమాలు, పంచ శయ్యాదివాసాలు, 6న ఆషాడ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 7 ఉదయం 9.20 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు జగన్నాథ స్వామి తొలి రథయాత్ర ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 8 నుంచి 17వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

తిరుగు రథయాత్ర..

18 ఉదయం 9.15 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి మేళతాళాలు, బాణసంచా, మంగళ వాయిద్యాల నడుమ జగన్నాథుని నామ స్మరణతో వేద పండితుల పారాయణలతో అత్యంత వైభవంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు. 19 ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలో అధిష్ఠింపజేస్తారు.

స్వామి అవతారాలు..

8న మత్స్యావతారం, 9న కూర్మావతారం, 10న వరాహావతారం, 11,12న నృసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న శ్రీరామావతారం, 16న బలరామ.. శ్రీకృష్ణావతారం, 17న తొలి ఏకాదశి, శేషపాన్పు అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

డాక్టర్ ప్రసాద్‌కు సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

సీతంపేట: డాక్టర్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన వరల్డ్ కాన్ఫరెన్స్‌లో నగరానికి చెందిన డాక్టర్ ప్రసాద్ మారెళ్ల నేషనల్ సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన సుమారు వెయ్యి మంది వైద్యులు పాల్గొన్నారు. ఇండియాతో పాటు దుబాయ్, ఇటలీ, సింగపూర్ వంటి దేశాల నుంచి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ఆర్థో, కార్డియో, న్యూరో, స్పోర్ట్స్ రిహాబిలిటేషన్ తదితర అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. అపోలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హన్నా రాజశేఖర్, పీఎఫ్ఐ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.ప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ ప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ, ఉచిత వైద్య శిబిరాలు, కరోనా సమయంలో అందించిన వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

